సాక్షి నిజామాబాద్

ఆదివారం । 5 । నవంబర్ । 2023



ఏం ఫాంలో ఏముంది..?

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థులు వేసే ఏ, బీ ఫాంలకు సంబంధించిన సమాచారంతో 'సాక్షి' ప్రత్యేక కథనం..

- 10లో ▸



సన్నాలవైపే వ్యాపారులు..

రైతుల నుంచి సన్నరకం ధాన్యం కొనుగోళ్ల పైనే రైస్‌మిల్లర్లు, స్టాకిస్టులు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువ ధర ఇచ్చి కొంటున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /22.1

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచే చల్లటి గాలులు వీస్తాయి. ఎండతీవ్రత తక్కువగా ఉండవచ్చు. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల వ్యయంపై ఫిర్యాదు చేయవచ్చు

సుభాష్‌నగర్ : ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ప్రజలు, ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. అర్బన్, నిజామాబాద్ రూరల్ శాసనసభ నియోజకవర్గాలకు పాటిల్ చిన్మయ్ ప్రభాకర్ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఉ న్నారని, 83320–21903లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య నేరుగా కలవొచ్చన్నారు. బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాలలకు సంబంబధించి పరిశీలకులు ఏ శక్తి(83320 21809)లో ఫిర్యాదు చేయవచ్చని, ఎస్సారెస్పీ గెస్ట్ హౌస్‌లో నేరుగా కలవొచ్చన్నారు. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాలకు సంబంధించి తాన్యాసింగ్ (83320–21892)కు ఫిర్యాదు చేయవచ్చని, బోధన్ ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లో సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య నేరుగా కలవొచ్చన్నారు. వ్యయ పరిశీలకుల మొదటి విడత పర్యటన 5వ తేదీ వరకు ఉంటుందని, రెండో విడత పర్యటన 9వ తేదీ నుండి పోలింగ్ పూర్తి అయ్యేంత వ రకు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

సైబర్ బాధితులు ఫిర్యాదు చేయండి



ఖలీల్‌వాడి : సైబర్ బాధితులు టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేస్తే తక్షణమే వివరాలను సేకరించి బ్యాంక్ ఎకౌంట్‌ను ఫ్రీజ్ చేస్తారని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన సైబర్ నేరాలపై అవగహన సదస్సులో జిల్లా జడ్జి పాల్గొని మాట్లాడారు. స్మార్ట్ ఫోన్‌లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ఎలాంటి మేసేజ్‌లు వచ్చిన స్పందించవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల బాధితులు టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ అవగహన సదస్సులో సీపీ కల్మేశ్వర్, ఏసీపీ సైబర్ క్రైం వేణుగోపాల్‌రెడ్డి, సీఐ ముఖీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారుడికి అభినందన



డిచ్‌పల్లి : జాతీయ స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన అల్లుల్ల అనిల్‌ను శనివారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేకంగా అభినందించారు. నగరంలోని తన నివాసంలో అనిల్‌ను శాలువాతో సత్కరించారు. నవంబర్ 4 నుంచి 8వరకు శ్రీనగర్‌లో జరుగనున్న 45వ జాతీయ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో చక్కని ప్రతిభ చూపి తెలంగాణ రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ కార్యదర్శి నవీన్, ఉపాధ్యక్షులు శోభన్‌బాబు, అభిషేక్ గౌడ్, చిన్నికృష్ణ, నిజామాబాద్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి గంగామోహన్ తదితరులున్నారు.

ఉమ్మడి నిజామాబాద్‌కు ఏఐసీసీ పరిశీలకులు

ఖలీల్‌వాడి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ పరిశీలకులను నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గానికి అనిల్ చిక్క మధు, కామారెడ్డికి యూబీ వెంకటేష్, బోధన్‌కు ఆసిఫ్ సైత్, బాల్కొండకు ప్రదీప్ ఈశ్వర్, ఆర్మూర్‌కు ఎస్ఎన్ సుబ్బారెడ్డిని నియమించారు.

18న ఇందూరు నాటక రంగంపై ఉపన్యాసం

నిజామాబాద్ సిటీ : ఈనెల 18న జిల్లా కేంద్రంలోని హరిచరణ్ హిందీ విద్యాలయం(బస్టాండ్ పక్కన)లో 'ఇందూరు జిల్లా నాటక రంగం – చరిత్ర' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఇతిహాస సంకలన సమితి ఇందూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెయూ ప్రొఫెసర్ డాక్టర్ చందుపట్ల ఆంజనేయులు, ప్రఖ్యాత నాటకరంగ కళాకారులు శ్రీపాద నాటక కళా పరిషత్ వ్యవస్థాపకుడు శ్రీపాద కుమార శర్మ హాజరు కానున్నార న్నారు. 18న సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం జరుగనుందన్నారు.

అర్బన్ నుంచి షబ్బీర్!

అనేక మలుపులు, తర్జనభర్జనల మధ్య కాంగ్రెస్ అధిష్టానం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కొడంగల్‌తో పాటు కామారెడ్డి నుంచి బరిలోకి దించేందుకు నిర్ణయించింది. ఈ క్రమంలో కామారెడ్డికి చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్‌అలీకి నిజామాబాద్ అర్బన్ టిక్కెట్టు ఖరారు చేశారు.

- కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి
- 7, 8న నామినేషన్లు దాఖలు చేయనున్న నేతలు
- నగరంలో నేడు కాంగ్రెస్ నాయకులతో భేటీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి పార్టీ నాయకత్వం భారీ కసరత్తే చేసింది. నామినేషన్ల ప్రక్రియ మొదలైనప్పటికీ ఇంకా 9 స్థానాలకు గాను మొదటి రెండు విడతల్లో 5 సీట్లకు మాత్రమే అభ్యర్థులు ఖరారు అయ్యారు. మరో 4 సీట్లకు అభ్యర్థుల ప్రకటన చేయలేదు. ఇదిలా ఉండగా కామారెడ్డి నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బరిలోకి దిగడంతో పరిస్థితులు మారిపోయాయి. ఆ ప్రభావంతో నిజామాబాద్ అర్బన్ సీటు విషయంలోనూ ప్రతిష్టంభన నెలకొంది. ఈ క్రమంలో అనేక మలుపులు, తర్జనభర్జనలు, ఊహాగానాలు, వార్తలు చోటుచేసుకున్నాయి. అయితే కాంగ్రెస్ అధిష్టానం మాత్రం కామారెడ్డి నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని బరిలోకి దించేందుకు నిర్ణయించింది. ఈ విషయమై సుదీర్ఘ కసరత్తు చేస్తూ వచ్చారు. చివరకు ఢిల్లీ పెద్దలు రేవంత్‌ను కొడంగల్‌తో పాటు కామారెడ్డి నుంచి సైతం పోటీ చేయించి కేసీఆర్‌ను ఢీకొట్టేందుకు రంగం సిద్ధం చేశారు. దీంతో కామారెడ్డికి చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్‌అలీకి అర్బన్ టిక్కెట్టు ఖరారు చేశారు. ఇందుకు సంబంధించి అధినాయకత్వం తీసుకున్న నిర్ణయానికి సంబంధించి గాంధీ భవన్‌లో శనివారం జరిగిన ఉమ్మడి జిల్లా నాయకుల సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఆదివారం నిజామాబాద్ నాయకులతో షబ్బీర్ భేటీ కానున్నారు. షబ్బీర్ నామినేషన్ విషయమై తేదీ ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 7న షబ్బీర్ నామినేషన్ దాఖలు చేసే అవకాశాలున్నాయంటున్నారు. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈనెల 6న కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదే విధంగా ఈ నెల 9న కామారెడ్డిలో రేవంత్ నామినేషన్ వేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది.

■ నిజామాబాద్ అర్బన్ టిక్కెట్టు విషయమై నెలరోజులుగా అనేక మలుపులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు ఈ సీటుపై తీవ్ర ఉత్కంఠ వాతావరణం కొనసాగింది. బీసీ కోటా కింద మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ తుదివరకు తీవ్రంగా ప్రయత్నించారు. మైనారిటీ కోటాలో పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ గట్టి ప్రయత్నాలు చేశారు. చివరకు షబ్బీర్‌కు దీన్ని కేటాయించారు. ఇదిలా ఉండగా మొదట్లో ఈ స్థానం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు కేటాయించారు. అయితే మారిన పరిణామాల నేపథ్యంలో షబ్బీర్‌కు ఈ టిక్కెట్టు కేటాయించడంతో మహేష్‌కుమార్ గౌడ్‌కు, అధికారంలోకి వచ్చాక మొదటి విడతలోనే ఎమ్మెల్సీ పదవి ఇచ్చి కేబినెట్‌లోకి తీసుకునేందుకు హామీ ఇచ్చి అధిష్టానం బుజ్జగించింది. ఇక బాన్సువాడ కాంగ్రెస్ టిక్కెట్టును ఇటీవల బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఏనుగు రవీందర్‌రెడ్డికి ఇవ్వనున్నట్లు సమాచారం. జుక్కల్ టిక్కెట్టు కోసం మాజీ ఎమ్మెల్యే సొదాగర్ గంగారాం, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, ఎస్ఆర్ఐ లక్ష్మీకాంతారావు మధ్య పోటీ నెలకొంది. మొత్తానికి కేసీఆర్, రేవంత్‌లు పోటీపడుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణలో రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఇదిలా ఉండగా కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి బలంగా ఉండడంతో త్రిముఖ పోటీ తప్పనిసరి అయింది. ఇందులో ఎవరు గెలుస్తారో అనే ఉత్కంఠ నెలకొంది. ఇక నిజామాబాద్ అర్బన్‌లోనూ బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ త్రిముఖ పోరు కానుంది.

హవాలా డబ్బుపై ఇంటెలిజెన్స్ ఆరా?

- ఎస్‌హెచ్‌వో, సీఐ వ్యవహారంపై నిఘా
- రంగంలోకి దిగిన ఎస్పీ
- జిల్లాలో హవాలా వ్యాపారులపై దృష్టి

సాక్షి ఎఫెక్ట్..

ఖలీల్‌వాడి : జిల్లాలో ఇటీవల హవాలా డబ్బులను పోలీసులు నొక్కేసిన సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు ఆలస్యంగా తెలిసింది. గతనెల 20న 'హవాలా డబ్బులు హాంఫట్' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా పోలీసులతో పాటు ఇంటెలిజెన్స్ వర్గాలు విచారణ చేపట్టినట్లు సమాచారం. ఓ మండలానికి చెందిన హవాలా వ్యాపారి నగరంలోని గంజ్ ప్రాంతానికి వాహనంలో హవాలా డబ్బులతో రావడంతో పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. సదరు హవాలా వ్యాపారిని డైరెక్ట్‌గా వెళ్లి అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, రూ.16 లక్షలను తీసుకున్నట్లు సమాచారం. అనంతరం హవాలా వ్యాపారి, ఎస్‌హెచ్‌వో, ఓ సీఐ బేరసారాలు చేసి రూ. 8 లక్షలు తీసుకుని మిగితా రూ. 8లక్షలను ఓ సీఐ, ఎస్‌హెచ్‌వో, సమాచారమిచ్చిన వారు వాటాలు చేసుకుని పంచుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సెటిల్‌మెంట్‌లో ఎస్‌హెచ్‌వోకు ఫోన్ చేసి సమాచారమిచ్చినవారికి రూ. 3 లక్షలు, హవావా డబ్బులు సెటిల్‌మెంట్ చేసిన ఓ సీఐకి రూ. 1.50 లక్షలు తీసుకున్నట్లు తెలుస్తోంది. హవాలా వ్యాపారిని పట్టుకున్న ఎస్‌హెచ్‌వోకు రూ. 3.50 లక్షలు తీసుకున్నట్లు తెలిసింది. దీనిపై పోలీసు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. ఈ సెటిల్‌మెంట్‌పై కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలతో పాటు స్పెషల్ బ్రాంచ్ వర్గాలు కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. హవాలా డబ్బుల వ్యవహారంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారి కూడా సీరియస్ అయినట్లు సమాచారం.



ఎన్నికల వేళ పట్టుకున్నట్లుగా..

సదరు రూ. 8 లక్షలను నొక్కేసిన సదరు పోలీసు అధికారులు ఆ విషయాన్ని పక్కన పెట్టేసి.. ఎన్నికల వేళ పట్టుకున్న డబ్బులను చూపిస్తూ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల కంటే ముందే హవాలా డబ్బులను వాటాలు వేసుకున్న పోలీసులు ఎన్నికల వేళ పట్టుకున్న డబ్బులుగా చెప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఇద్దరు పోలీసు అధికారులు తమ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరు పోలీసు అధికారులు హవాలా వ్యాపారితో కుమ్మక్కై ఏకంగా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించడంపై వారు కూడా సీరియస్ అయినట్లు తెలిసింది. ఈ ఇద్దరు పోలీసు అధికారుల్లో ఒకరు పీడీఎస్ బియ్యం వ్యాపారులతో సంబంధాలున్నాయనే ఆరోపణలున్నాయి. మరొకరు ఇతర ఘటనల ద్వారా డీఐజీకి అటాచ్ చేయబడ్డారు. అయితే ఓ రాజకీయ నేత ద్వారా మళ్లీ ఆయన పోస్టింగ్ తీసుకున్నట్లు తెలిసింది. హవాలా డబ్బులపై కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్, ఎస్పీ అధికారులు విచారణ చేపట్టడంతో పోలీసువర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఏ ప్రాంతాల్లో హవాలా వ్యాపారులున్నారు..?

ఎన్నికల వేళ పోలీసులు హవాలా వ్యాపారులపై దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో ఎక్కువమంది గల్ఫ్ ప్రాంతాలకు వెళ్లడంతో ఇక్కడ హవాలా వ్యాపారులు అధికంగా ఉండటంతో పోలీసులు హవాలా దందాపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఏఏ ప్రాంతాల్లో హవాలా వ్యాపారులు ఉన్నారు. గతంలో ఎవరి మీదైనా పోలీసులు కేసులు నమోదయ్యాయా..అనే వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా హవాలా డబ్బులను పోలీసులు పట్టుకున్నారు. దీంతో జిల్లా తోపాటు మండల కేంద్రాలకు హవాలా డబ్బులు చేరుతున్నాయని పోలీసులు గుర్తిస్తున్నట్లు తెలిసింది.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ఎన్నికల్లో ఎంతో ప్రాధాన్యతతో కూడుకుని ఉండే పోలింగ్ విధులను ప్రిసైడింగ్ అధికారులు (పీవోలు), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో) సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. పోలింగ్ రోజు కలెక్టర్‌తో పోలిస్తే పీవోలు నిర్వర్తించాల్సిన బాధ్యత ఎంతో ఎక్కువ కావడంతో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారులకు శనివారం మలివిడత శిక్షణ కా ర్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాక్ పోల్ తర్వాత తప్పనిసరిగా డాటా డిలీట్ చేయాలని, ఈవిషయాన్ని ప్రతి ప్రి సైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి గుర్తుంచుకో వాలని అన్నారు. 29న ఉదయం 7 గంటల వరకు తమ తమ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని కలెక్టర్ సిబ్బందికి ఆదేశించారు. చెక్‌లిస్టుకు అనుగుణంగా పోలింగ్ సామగ్రిని పరిశీలించుకోవాలన్నారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి 12 నామినేషన్లు

- బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్
- బోధన్‌లో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తరఫున నామినేషన్ దాఖలు



నామినేషన్ వేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో శనివారం రెండో రోజు 12 నామినేషన్లు దాఖలయ్యాయి. బాన్సువాడ నుంచి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బోధన్ నుంచి మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి తరఫున ఆయన మద్దతుదారులు నామినేషన్ దాఖలు చేశారు. ఆర్మూర్‌లో స్వతంత్ర అభ్యర్థి, నిజామాబాద్ అర్బన్‌లో బహుజన్ లెఫ్ట్ పార్టీ (బీఎల్‌పీ) తరఫున ఒకరు, స్వతంత్ర అభ్యర్థి ఒకరు నామినేషన్ వేశారు. నిజామాబాద్ రూరల్ లో ఒకరు స్వతంత్ర అభ్యర్థి, ఒకరు ఆల్‌ఇండియా మజ్లిస్ ఏ ఇంక్విలాబ్ మిల్లత్ పార్టీ తరఫున నామినేషన్ వేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. జుక్కల్ లో బీఎస్పీ తరఫున ఒకరు నామినేషన్ వేశారు. బాల్కొండ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో ఎవరూ నామినేషన్లు వేయలేదు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

ఎన్సీఎస్ఎఫ్‌కు మోక్షం లభించేనా!

- సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని రైతుల డిమాండ్
- ఫ్యాక్టరీతో 500 మందికి ఉపాధి, 5 వేల మంది రైతులకు లబ్ధి



నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలం సారంగాపూర్‌లోని నిజామాబాద్ కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ(ఎన్సీఎస్ఎఫ్) పునఃప్రారంభం కోసం రైతులు, కార్మికులు నిరీక్షిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఆయా పార్టీలు ప్రకటన చేయాలని రైతులు ఒత్తిడి చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీతో ప్రత్యక్షంగా 500 మందికి కార్మికులకు, పరోక్షంగా 500 మందికి కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ఐదు వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ ఎన్నికల్లోనైనా చక్కెర ఫ్యాక్టరీకి మోక్షం కలుగుతుందని రైతులు ఎంతగానో ఆశగా ఎదురుచూస్తున్నారు. రూరల్ సెగ్మెంట్ పరిధిలో సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ ఒక్కటే ఉండగా అభ్యర్థుల్లో చక్కెర ఫ్యాక్టరీ ప్రారంభించాలని ఆలోచన రాకపోవడంతో కార్మికులకు, రైతులకు తీవ్ర ఆందోళన నెలకొంది. రైతులకు, కార్మికులకు ఒక్కప్పుడు వరంగా నిలిచిన సారంగాపూర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభం కలగానే మిగిలింది.

అడవిని తలపిస్తున్న ఫ్యాక్టరీ

పునఃప్రారంభానికి నోచుకోకపోవడంతో ఫ్యాక్టరీ పరిసరాలు అడవిని తలపిస్తున్నాయి. విలువైన ఫ్యాక్టరీ సామగ్రి తుప్పుపడుతున్నాయి. ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు కొందరు మృతిచెందగా, మరి కొందరు ఫ్యాక్టరీలోనే ఇతర పనులు చేసుకుంటున్నారు. 18 మంది మాత్రమే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. వారు కూడా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న గోదాముల్లో ధాన్యం నిలువ ఉంచి దాని ద్వారా వచ్చిన అద్దె డబ్బులతో రూ.6 వేల చొప్పున కార్మికులకు జీతాలు చెల్లిస్తున్నారు.

అమలుకు నోచుకోని హామీలు

ఉమ్మడి రాష్ట్రంలో 1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించాల ని ప్రయత్నించగా 54 మంది రైతులు ఉద్యమించి అడ్డుకున్నారు. ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 2003లో హైకోర్టు సైతం తీర్పునిచ్చింది. 2008 వరకు ఫ్యాక్టరీ ఎలాంటి అవరోధాలు లేకుండా సాఫీగా నడిచింది. ఆ తర్వాత ఫ్యాక్టరీ మూతపడగా 2014 జూలై 19న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఫ్యాక్టరీ ప్రాంగణంలో 500 మంది రైతులతో సమావేశమై పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గోవర్ధన్ సూచన మేరకు 2019 సెప్టెంబర్ 21న మంత్రి కేటీఆర్‌ను కలువగా నెల రోజుల్లో తెరిపిస్తామని చెప్పారు. కానీ ఆ హామీలు అమలుకు నోచుకోలేదు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో కల్వకుంట్ల కవిత సారంగాపూర్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆమె ఓటమి పాలు కావడంతో దాని గురించి పట్టించుకోలేదు.

ప్రారంభించే వారికే ఓటు



సారంగాపూర్ చక్కర ఫ్యాక్టరీ పరిధిలో 500 మంది కార్మికులు, 5వేల మంది చెరుకు పండించే రైతులు ఉన్నారు. కర్మాగారాన్ని ప్రారంభించడానికి కృషి చేసే నాయకులకే మా ఓట్లు వేస్తాం.

– కొండెల సాయిరెడ్డి, చైర్మన్, చక్కెర ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ, సారంగాపూర్

ప్రలోభాలకు గురికాకుండా గట్టి నిఘా

- ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ.శక్తి
- నోడల్ అధికారులతో భేటీ
- ఎన్నికల నియమావళి అమలు చర్యలను వివరించిన కలెక్టర్



కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో భేటీ అయిన వ్యయ పరిశీలకులు

సుభాష్‌నగర్ : జిల్లాలో పోలింగ్‌కు రెండు, మూడు రోజుల ముందు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా అన్ని ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచాలని, అవసరమైతే ఎక్కువ బృందాలు ఏర్పాటు చేసుకోవాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ శక్తి పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు శనివారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో భేటీ అయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు జిల్లాలో ఎన్నికల సందర్భంగా తీసుకున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు ఏ శక్తి మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకుల ద్వారా, యూపీఐ చెల్లింపులను పరిశీలించాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మద్యం తరలించకుండా డ్రైవర్, కండక్టర్లకు జాగ్రత్తలు సూచించాలన్నారు. కలెక్టరేట్‌లోని మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెంటర్, కంట్రోల్ రూంలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వాటిలో బాన్సువాడ సెగ్మెంట్ కామారెడ్డి, నిజామాబాద్‌లలో కలిసి ఉందని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ శక్తి, తాన్యాసింగ్, పాటిల్ చిన్మయ్ ప్రభాకర్ దృష్టికి తెచ్చారు. బాల్కొండ పరిధిలోని మానాల రెవెన్యూ గ్రామం జాబితాలో ఉన్న నాలుగు పోలింగ్ కేంద్రాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 36 మండలాలున్నాయని, 1,549 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని లెక్కించేందుకు మరిన్ని బృందాలు పనిచేస్తాయన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా రూ.83,84,173 విలువైన అక్రమ మద్యం నిల్వలను సీజ్ చేశామన్నారు. సీవిజిల్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా ఫిర్యాదు లు వస్తున్నాయన్నారు. 4 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, వివిధ కమిటీ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్రాష్ట్ర సరిహద్దులో నిఘా ఉంచాలి



బోధన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంతరాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో మద్యం, డబ్బు అక్రమ రవాణా నియంత్రణకు నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల వ్యయం పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారిణి తనీయా సింగ్ చెక్ పోస్టు అధికారులను ఆదేశించారు. సాలూర మండల కేంద్రం శివారులోని సాలూర అంతర్రాష్ట్ర ఉమ్మడి చెక్ పోస్టును శనివారం తనిఖీ చేశారు. చెక్ పోస్టుల్లో రికార్డులను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ మల్లేశం, ఎంఆర్ఐ గంగాధర్ ఉన్నారు.

గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

మద్నూర్: మండలంలోని పెద్ద ఎక్లారలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ సవితను సస్పెన్షన్ చేస్తున్నట్లు శనివారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తెలంగాణ సోషల్ వెల్ఫే రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సెక్రటరీ ఉత్తర్వులను విడుదల చేశారు. ఆరు రోజుల క్రితం గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వసుధ అనే విద్యార్థిని హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

విద్యార్థి సంఘాల దీక్ష



బిచ్కుంద: పెద్ద ఎక్లారలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఇటీవల చనిపోయిన విద్యార్థిని వసుధ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తూ బిచ్కుందలో విద్యార్థి సంఘాల నాయకులు శనివారం దీక్ష చేపట్టారు. విద్యార్థిని మృతికి కారకులైన వారిని శిక్షించి కళాశాల సిబ్బంది, ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వసుధ ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ప్రిన్సిపాల్, సిబ్బంది నిజాలను దాచిపెడుతున్నారని, విచారణ చేపడితే నిజాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థిని వసుధ తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు దీక్షను కొనసాగిస్తామని అన్నారు. నూకల రాజు, వెంకట్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఓటే.. వజ్రాయుధం

- అవినీతి లేని సమాజ నిర్మాణానికి ఓటర్ల పాత్ర కీలకం
- సరైన నాయకుడి కోసం ఆలోచించి ఓటేద్దాం..



నిజామాబాద్ రూరల్: ఓటు.. ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటిది. సద్వినియోగం చేసుకుంటేనే సార్థకత ఉంటుంది. ఓటు ద్వారా పాలకులను ఎన్నుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని తమ విలువైన ఓటును సరైన నాయకుడిని ఎంచుకొకునేందుకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు ఉన్న నేపథ్యంలో అక్టోబర్ 31 వరకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కు నమోదు ప్రక్రియ కొనసాగింది. 18 ఏళ్లు నిండిన యువత తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. యువత వజ్రాయుధం లాంటి తమ ఓటును ఆలోచించి ఉత్తమ నాయకుడికే ఓటు వేయాలని పలువురు మేధావులు పేర్కొంటున్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాల్లో అభివృద్ధి ఏ మేరకు జరిగిందో దానికి కారకులు ఎవరు.. అభివృద్ధి జరగకపోవడానికి కారణాలు ఎవరో ఆలోచించి సరైన నాయకుడిని ఎంచుకునే అవకాశం మన చేతుల్లోనే ఉంది. అలాంటి నాయకుడిని ఎంచుకునే తరుణంలో తొందరపాటు వద్దని పలువురు మేధావులు పేర్కొంటున్నారు. ఓటు వేసేటప్పుడు పలువురు రాజకీయ నాయకులు ఎన్నో ప్రలోభాలకు గురి చేస్తుంటారు. తాను ఎంతో అభివృద్ధి చేశానని.. తనకు ఓటు వేయాలని అభ్యర్థిస్తుంటారు. డబ్బు, మద్యం, దుస్తులు ఇలా అనేక రకాలుగా ఓటర్లను తమ వైపునకు మలుచుకునేలా అభ్యర్థులు ఎంతో మంది తమ ప్రయత్నాలు కొనసాగిస్తుంటారు. కానీ వాటిని ఓటర్లు గమనిస్తూ తమనకు కావాల్సింది ఓటుకు నోటు కాదు.. సరైన నాయకుడి పాలన. అలాంటి నాయకుడు పాలనలో ఉంటే ప్రజలకు ఎంతో మేలు కలుగుతుంది. తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే నాయకులకే యువత ఓటర్లు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇకనైనా ఈ ఎన్నికల్లో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకొని సరైన నాయకుడిని ఎంచుకోవాలని మేధావులు పేర్కొంటున్నారు. జిల్లాలో 13,658,11 ఓటర్లు ఉండగా, మహిళలు7,18,603, పురుషులు 6,47,149, ఇతరులు 59 మంది ఉన్నారు.

అనుమానాలకు తావివ్వకుండా..

ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ బూత్‌లోకి వెళ్లినప్పుడు ఓటర్ కార్డు, ఆధార్ కార్డుతో ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఓటు వేసేటప్పుడు నిదానంగా మనం ఏ నాయకుడికి వేయాలనుకుంటున్నామో గుర్తించి ఆ పార్టీ గుర్తుపై సరిగ్గా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటు హక్కును వినియోగించుకున్న ఐదు సెకండ్ల తర్వాత మనం ఏ గుర్తుకు అయితే ఓటు వేశామో ఆ గుర్తు వీవీ ప్యాడ్ లో కనిపిస్తుంది. అప్పటివరకు తాము ఏ గుర్తుకు ఓటే వేసామనే విషయంపై నిర్ధారణకు వచ్చిన తర్వాతే పోలింగ్ బూత్ నుంచి నిష్క్రమించాలి. ఏవైనా అనుమానాలు ఉంటే వెంటనే పోలింగ్ బూత్ అధికారులకు సమాచారం అందించాలి.

17 ఏళ్ల తర్వాత ఓటు హక్కు వినియోగం



నేను బతుకుదెరువు కోసం 17 ఏళ్ల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాను. ఇటీవల గల్ఫ్ దేశం నుంచి వచ్చాను. నేను పని చేసే కంపెనీ మూడు నెలల పాటు సెలవును మంజూరు చేసింది. ఎన్నికల్లో నా ఓటు హక్కును వినియోగించుకోనుండడం ఆనందగా ఉంది. ఓటుకు నోటు సరైంది కాదు. ప్రతి ఒక్కరూ ఆలోచించి సరైన నాయకుడికి ఓటు వేయాలి. –తాళ్ళ భగవాన్, బర్దీపూర్

ఓటుకు నోటు సరైంది కాదు



ఓటుకు నోటు మనకే చేటు. ఈ అసెంబ్లీలో ఎన్నికల్లో మొదటిసారి ఓటెయ్యబోతున్నాను. నేను మాత్రం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే నాయకుడికే నా ఓ టు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఉండాలి. అధికారులు, పోలీసులు ప్రజలకు మద్దతుగా నిలవాలి. అవినీతి నిర్మూలనకు యువత నడుం బిగించాలి. –టి. నిక్షిత, విద్యార్థిని

సన్నాల వైపే వ్యాపారులు

- బహిరంగ మార్కెట్లో ధర ఎక్కువ
- పది రోజుల్లోనే ధాన్యం డబ్బుల చెల్లింపునకు అంగీకారం
- వ్యాపారులకే విక్రయించడానికి రైతుల ఆసక్తి



మోర్తాడ్‌లో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న మిల్లర్లు

మోర్తాడ్: వరి కోతల్లో వేగం పెరగడంతో సన్న రకం వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి రైస్‌మిల్లర్లు, స్టాకిస్టులు మధ్యవర్తుల ద్వారా గ్రామాల్లో ధాన్యం తూకం వేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్ణయించిన మద్దతు ధర కంటే వ్యాపారులే ఎక్కువ ధర చెల్లిస్తుండడం విశేషం. కొనుగోలు చేసిన వారం, పది రోజుల్లో డబ్బులు చెల్లించడానికి అంగీకారం కుదుర్చుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే నెల రోజులకు మించి డబ్బుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. కొందరు మిల్లర్లు బీపీటీతో పాటు దొడ్డు రకాలైన 1010ను కూడా కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకంటే మిల్లర్లు ఎక్కువ ధర చెల్లించడంతో పాటు ఎక్కువ రోజుల వాయిదా లేకపోవడంతో రైతులకు లాభం జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో వర్షాకాలంలో సాగు చేసిన వరి పంటలో 60 శాతానికి మించి ఉన్న సన్న రకాలను సాగు చేయడంతో ఈ ధాన్యాన్ని రైతులు బహిరంగ మార్కెట్లోనే విక్రయిస్తున్నారు.

మిల్లర్లు నిర్ణయించిన ధర ఇలా...
బీపీటీ(పచ్చివి) రూ.2,200 (మూడు కిలోల తరుగుతో), బీపీటీ(డ్రై) రూ.2,400, నాన్ బీపీటీ(పచ్చివి) రూ.2,100, నాన్ బీపీటీ(డ్రై) రూ.2,250, 1010(పచ్చివి) రూ.1,950, ఎండినవి రూ.2,200.

పల్లె ప్రకృతివనంలో మొక్కలు ధ్వంసం



ధ్వంసమైన మొక్కలు, గేటు

దోమకొండ: మండలంలోని అంబారిపేట పల్లె ప్రకృతివనంలో మొక్కలతో పాటు గేటును శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఎస్సై మురళి శనివారం తెలిపారు. ఉదయం జరిగిన విషయాన్ని గుర్తించిన పంచాయతీ కార్యదర్శి అంజిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మురళి, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నియోజకవర్గం ఒక్కటి-జిల్లాలు రెండు



బాన్సువాడ ముఖ చిత్రం

బాన్సువాడ: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడ నియోజకవర్గం రెండు జిల్లాలో ఉండడం గమనార్హం. గతంలో నియోజకవర్గంలో బాన్సువాడ, బీర్కూర్, వర్ని, కోటగిరి మండలాలు ఉండేవి. బాన్సువాడ మున్సిపాలిటీతో పాటు బాన్సువాడ మండలం, బీర్కూర్, నస్రూల్లాబాద్ మండలాలు కామారెడ్డి జిల్లాలో ఉంటే వర్ని, కోటగిరి, రుద్రూర్, పొతంగల్, మోస్రా, చందూర్ మండలాలు నిజామాబాద్ జిల్లా పరిధిలోకి వస్తాయి. 2016లో బీర్కూర్‌లో ఉన్న నస్రూల్లాబాద్‌ను మండలంగా ఏర్పాటు చేయగా, 2018 ఎన్నికల ముందు వర్ని మండలంలో ఉన్న రుద్రూర్‌ను కొత్త మండలంగా ఏర్పాటు చేశారు. 2019లో వర్నిలో కొనసాగుతున్న మోస్రా, చందూర్‌ను మండలాలుగా ఏర్పాటు చేశారు. 2023లో పొతంగల్‌ను మండలంగా ప్రకటించారు. 2018 ఎన్నికల్లో ఐదు మండలాలు బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్, వర్ని, కోటగిరి ఉంటే ప్రస్తుతం ఈ ఎన్నికల్లో బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్, వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, పొతంగల్ (9) మండలాలు ఉన్నాయి. కొత్తగా నస్రూల్లాబాద్, రుద్రూర్, చందూర్, మోస్రా, పొతంగల్ మండలాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 258 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నిజామాబాద్ జిల్లాలో ఉన్న బాన్సువాడ నియోజకవర్గం కొత్తగా ఏర్పాటు చేసిన కామరెడ్డి జిల్లాలో మూడు మండలాలు, పాత నిజామాబాద్ జిల్లాలో ఆరు మండలాలు ఉన్నాయి.

మండలం	పోలింగ్ బూత్‌లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
పొతంగల్	29	10,281	10,922	1	21,204
కోటగిరి	24	8789	9632	2	18,423
రుద్రూర్	22	8032	8891	0	16,923
మోస్రా	14	4835	5402	1	10,238
చందూర్	12	4026	4332	0	8358
వర్ని	35	12,297	13,239	0	25,536
నస్రుల్లాబాద్	26	9885	11,110	0	20,995
బీర్కూర్	28	9162	10,236	0	19,398
బాన్సువాడ	68	24,918	26,844	4	51,766
మొత్తం	258	92,225	1,00,608	8	1,92,841

పెరిగిన ఎన్నికల వ్యయం..

- ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారానికి రూ.40లక్షలు ఖర్చు పెట్టొచ్చు
- 2018 ఎన్నికల్లో రూ. 28 లక్షలే..

మోర్తాడ్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులు తమ ప్రచారానికి రూ.40లక్షల వరకు ఖర్చు పెట్టొచ్చని ఎన్నికల కమిషన్ నిర్దేశించింది. 2018 ఎన్నికల్లో ఎన్నికల వ్యయం రూ.28లక్షలే ఉంది. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమిషన్ అభ్యర్థుల ప్రచార ఖర్చును పెంచడం గమనార్హం. 2022లోనే సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచార వ్యయాన్ని రూ.40లక్షలకు పెంచాలని కమిషన్ నిర్ణయించింది. గత సంవత్సరం తీసుకున్న నిర్ణయాన్ని ఈ ఎన్నికల్లో అమలు చేస్తున్నారు. గత ఎన్నికల కంటే ఇప్పుడు రూ.12లక్షల ఖర్చు ఎక్కువ చేయడానికి అవకాశం ఉంది. ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయాన్ని బ్యాంకుల ఖాతా ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ఏ రకమైన ప్రచారానికి ఎంతెంత ఖర్చు చేసి బిల్లులు చూపాలో ఈ అంశాన్ని కూడా ఎన్నికల కమిషన్ సూచనలు చేసింది. ఇదిలా ఉండగా ఎన్నికల్లో పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు చేసే ఖర్చులకు ఎన్నికల కమిషన్‌కు చూపే ఖర్చులకు తేడా ఎంతో ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికల కమిషన్‌కు ఈ విషయాలు తెలిసినా నామ మాత్రపు ఖర్చుల లెక్కలతోనే సరిపెట్టుకుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

మిల్లర్లపై చర్యలు తీసుకోవడంలో సర్కారు విఫలం

- సీఎంఆర్ ఇవ్వని వారిపై కేసులు నమోదు చేయాలి
- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి



మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ధాన్యాన్ని పక్కదారి పట్టించిన రైస్ మిల్లర్స్‌పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనిమాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి రైస్‌మిల్లర్లకు అందిస్తుందన్నారు. మిల్లర్లు మిల్లింగ్ చేసి బియ్యం సర్కారుకు అందించాలి కానీ వారు ఇంత వరకు ప్రభుత్వానికి అందించకుండా తాత్సారం చేస్తున్నారని, అలాంటి వారిపై అధికారులు కేసులు నమోదు చేయాలన్నారు. కొందరు రైస్‌మిల్లర్స్ వద్దను బియ్యం చేయకుండా అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైస్‌మిల్లులో తనిఖీలు చేపట్టి అధికారులు కేసులు నమోదు చేయాలన్నారు.

కొందరు రైస్‌మిల్లర్స్ రూ. కోట్ల ధాన్యం తీసుకున్నా ఇంత వరకు ప్రభుత్వానికి బియ్యం అందించలేదన్నారు. కడ్తా పేరుతో రైతులను మోసం చేస్తున్నారని, కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి 8 నుంచి 10 కిలోల కడ్తా తీసుకున్న ఘటనలు జిల్లాలో ఉన్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండు కిలోల కడ్తా తీసుకున్నట్లు చెప్పారు. నందిపేట్‌లో లక్కంపల్లి సెజ్ ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వం ఫుడ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. బోధన్‌లో అలీసాగర్ ప్రాజెక్ట్ ద్వారా 34 పంటలకు సాగునీరు అందించామన్నారు. దీంతో రైతులకు సాగునీరు ఇబ్బందులు లేకుండా ఉందని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఉన్నారు.

క్రైం కార్నర్

టీవీఎస్‌ను ఢీకొన్న లారీ

- ఇద్దరు మృతి
- పరారీలో లారీ డ్రైవర్



మాక్లూర్: మండలంలోని చిక్లీ శివారులో వడ్ల లారీ టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందినట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..నందిపేట మండలంలోని కంఠం గ్రామానికి చెందిన రేవల్లి భూమన్న (45), గంధం నాగమణి(35) వరుసకు మామా కోడలు అవుతారు. వీరు జన్నెపల్లి పోస్టాఫీస్‌లో పింఛన్ తీసుకునేందుకు వచ్చారు. గుంజ్లి నుంచి వడ్ల లోడ్‌తో జన్నేపల్లి వైపు వెళ్తు న్న లారీ చిక్లీ శివారులో జన్నేపల్లి నుండి నందిపేట వైపు వెళ్తున్న వీరిని ఢీ కొన్నది. ఈ ఘటనలో వీరి తలలు పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బర్ధిపూర్‌లో బైక్ చోరీ

డిచ్‌పల్లి: మండలంలోని బర్దిపూర్ శివారులో ఉన్న ఓ కారు షోరూం ఎదుట ఉంచిన బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బర్దిపూర్ శివారులో ఉన్న కియా కారు షోరూం ఎదుట సాయితేజ అనే వ్యక్తి ఉదయం 9 గంటలకు తన బైక్‌ను పార్క్ చేశారు. కొద్దిసేపటికి బైక్ కనిపించలేదు.దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దుకాణంలో..
ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మయూరి లేడీస్ ఎంపోరియంలో గుర్తు తెలియని దొంగలు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. రూ.4వేల నగదు, రూ. ఆరువేలు విలువల చేసే వస్తువులను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు శ్రీధర్ తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

కేబుల్ వైర్లు..
ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని 35వ వార్డులో గుర్తు తెలియని దొంగలు శుక్రవారం రాత్రి ప్రభుత్వ బోరు బావులకు ఉన్న కేబుల్ వైర్లను చోరీ చేశారు. వార్డులోని నాలుగు ప్రభుత్వ బోరు బావులకు చెందిన కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లారు. స్థానికులు గుర్తించి మున్సిపల్ అధికారులు సమాచారం అందించారు.

రైలులో గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో అధికారులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో సంబల్‌పూర్ -నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎండు గంజాయిని ఆర్పీఎఫ్, రైల్వే, ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో శనివారం తనిఖీలు చేపట్టారు. బోగీలో 14.5 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకోగా గంజాయిని తరలిస్తున్న వారిని గుర్తించలేదన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్, ఆర్పీఎఫ్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, రైల్వే ఎస్సై తావునాయక్, ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ నారాయణరెడ్డి, సిబ్బంది విష్ణు, మంజుల తదితరులు ఉన్నారు.

జెడ్పీటీసీపై ఎంపీపీ దాడి అమానుషం



కామారెడ్డి టౌన్: మాచారెడ్డి జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డిపై ఎంపీపీ నర్సింగ్‌రావు దాడి చేయడం దారుణమని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేడు అధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రెడ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. జడ్పీటీసీపై జరిగిన దాడి ఘటనలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు నర్సింగ్‌రావును తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోకుంటే భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లబెల్లి కరుణాకర్ రెడ్డి, కోర్ కమిటీ చైర్మన్ నాగిర్తి చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్‌రెడ్డి, జిల్లా నాయకులు మల్లారెడ్డి, సతీశ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, భీమ్ రెడ్డి, రామ్ రెడ్డి, మసూవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్బాపూర్‌లో ఎక్సైజ్ అధికారుల దాడులు



నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామంలో స్టేట్ టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. గ్రామంలో కల్లు దుకాణాలు నిర్వహించే దూసరి నవీన్‌గౌడ్, దూసరి సావిత్రి ఇళ్లలో ఏకకాలంలో దాడులు చేపట్టారు. దాడుల్లో నిషేధిత పదార్థాలైన 13.9 కిలోల క్లోరల్ హైడ్రేట్(సీహెచ్), 3.6 కిలోల అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. కల్తీ కల్లుకు వాడే ఈ పదార్థాలు కలిగి ఉన్నందున సావిత్రిని అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. స్వాధీనం చేసుకున్న అల్ప్రాజోలం, సీహెచ్‌ల విలువ సుమారు రూ.36.70ల లక్షల విలువ ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దాడుల్లో ఎస్టీఎఫ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు, ఎస్సై కృష్ణకాంత్‌గౌడ్, ఎస్‌హెచ్‌వోలు దిలీప్, సింధు, సిబ్బంది మోహన్‌సింగ్, ధరిసింగ్, రవి పాల్గొన్నారు.

ఏ ఫాంలో ఏముంది..

ఖలీల్‌వాడి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. నామినేషన్లు వేసే సమయంలో అభ్యర్థులు సమర్పించే పత్రాలకు ప్రాధాన్యత ఉంటుంది. అభ్యర్థులు వేసే ఏ-ఫాం, బీ-ఫాం, అఫిడవిట్, పలు విషయాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- నామినేషన్ల దాఖలు చేసే అభ్యర్థులను ప్రతిపాదించే వ్యక్తి ఆ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి అయి ఉండాలి.
- ఎన్నికల సంఘం వద్ద గుర్తింపు పొందిన కేంద్ర, రాష్ట్ర స్థాయి పార్టీలకు చెందిన అభ్యర్థులను అదే నియోజకవర్గానికి చెందినవ్యక్తి ప్రతిపాదించాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, స్వతంత్రులు, గుర్తింపు లేని పార్టీలు ఉంటే వారిని నియోజకవర్గంలోని 10 మంది ఓటర్లు ప్రతిపాదించాలి.
- నామినేషన్ వేసే అభ్యర్థి నేరుగా లేదా తనను ప్రతిపాదించే వ్యక్తి నామినేషన్ దాఖలు చేయొచ్చు.
- నామినేషన్ వేసే అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఖాతాతోనే ఎన్నికల ఖర్చులకు సంబంధించిన లావాదేవీలు చూయించాలి. అంతేకాకుండా నామినేషన్ పత్రాల్లో బ్యాంక్ ఖాతా వివరాలను పొందుపర్చాలి.
- అభ్యర్థి నామినేషన్ పత్రంలో 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను జత చేయాలి.
- అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసేటప్పుడు రిటర్నింగ్ అధికారి వద్ద ప్రతిజ్ఞ (ఓత్) చేయాలి.
- జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన రాజకీయపార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ తోపాటు ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలను అందించాలి.
- నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు నిండి ఉండాలి. రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలోనైనా ఓటు హక్కు కలిగి ఉండాలి.
- రిటర్నింగ్ అధికారి వద్దకు నామినేషన్ వేసేందుకు అభ్యర్థులతో పాటు నలుగురికి అనుమతి ఇస్తారు.
- జనరల్ స్థానంలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ తోపాటు రూ.10 వేలు డిపాజిట్ చేయాలి. ఎస్సీ, ఎస్టీలు రూ.5 వేలు చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల నేర చరిత్ర, ఇప్పటి వరకు వివిధ పీఎస్‌లలో నమోదైన కేసుల వివరాలు, ఇతరత్రా కోర్టులో విచారణలో ఉన్న కేసులు, అభ్యర్థి తోపాటు భార్య, పిల్లలపై ఉన్న స్థిర చర ఆస్తుల వివరాలు, రుణాలు, అప్పులు, బంగారు ఆభరణాలు, నగదు నిల్వలకు సంబంధించి ఆఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఏ-ఫాం..

శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ధ్రువీకరించేందుకు జాతీయ, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు సంబంధిత రాష్ట్రంలో ఒకరికి బాధ్యతలు అప్పగిస్తారు. ఆ వ్యక్తి పోటీ చేసే అభ్యర్థులకు బీ-ఫాం అందిస్తారు. పార్టీ అధ్యక్షుడు పార్టీ అభ్యర్థులకు బీ-ఫాం అందించడానికి జారీ చేసే అధికారాన్ని అప్పగించడానికి ఏ-ఫాం సూచిస్తుంది.

- చివరి రోజు వరకు ఏ-ఫాం దఖాలు చేయాలి.
- ఏ-ఫాం తోపాటు బీ-ఫాంను అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయాలి. చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు దాఖలు చేయాల్సి ఉంటుంది. చివరి రోజు మాత్రం తప్పకుండా రిటర్నింగ్ అధికారికి అందించాల్సి ఉంటుంది.

బీ-ఫాం..

పార్టీ తరఫున ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే పత్రమే బీ-ఫాం. వివిధ రాజకీయపార్టీలకు చెందిన అభ్యర్థులకు అందజేస్తారు. పార్టీ తరఫున సదరు వ్యక్తి పోటీ చేస్తున్నారని తెలుపడా నికే ఈ ఫాం ఉపయోగపడుతుంది. దీంతో ఆ పార్టీ కి చెందిన గుర్తును ఎన్నికల అధికారులు కేటాయిస్తారు.